అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి


ఉపముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేసిన కర్క నాగరాజు, తదితరులు


డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన అసోసియేషన్ సభ్యులు

మూసాపేట: ఆరో తరగతి నుంచి పాఠశాల విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో భారతరాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రని వచ్చే విద్యా సంవత్సరం నుంచి చేర్చాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కర్క నాగరాజు బుధవారం వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా కర్క నాగరాజు మాట్లాడుతూ... ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం 6తరగతి నుంచి పాఠ్య పుస్తకాలలో చేర్చిన విధంగా ఇక్కడ కూడా ప్రవేశపెట్టాలని విన్నవించామన్నారు. అంబేడ్కర్ ఏ విధంగా కష్టపడి చదివి ప్రపంచ మేధావిగా గుర్తింపు తెచ్చుకున్నారో భావిభారత పౌరులైన విద్యార్థులు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు శ్రీకాంత్, సదా మహేష్, కర్క చిన్న సాయి, జక్కుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అసోసియేషన్ వినతి

భాగ్యనగరకాలనీ: హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు చేసిన వేలాదిమంది తెలంగాణలో ఉన్నారన్నారు. యూజీసీ రూల్స్ రెండేళ్లు చదివి నిపుణులుగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆస్పత్రులు, నాన్ మెడికల్ అడ్మినిస్ట్రేషన్, పేషెంట్ కేర్, ఆపరేషన్‌లు వంటి రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వీరిని నియమిస్తే వైద్యులపై భారం తగ్గి నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించవచ్చని వివరించామన్నారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రతి ఒక్కటిని అమలు చేస్తామని వారితో తెలిపారు. అడ్మినిస్ట్రేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రతినిధులు శ్రీకాంత్, గోపాల్‌రెడ్డి, హరీష్, ఉదయ్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

కబడ్డీ చాంపియన్‌షిప్ @ బాచుపల్లి

తొలిసారిగా జాతీయస్థాయి కబడ్డీ పోటీలు


బాచుపల్లిలో ప్రాక్టీస్ చేస్తున్న తెలంగాణ కబడ్డీ బాలుర జట్టు

- హర్షం వ్యక్తం చేస్తున్న బాచుపల్లి వాసులు
- ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు జూనియర్ కబడ్డీ పోటీలు
- 60 జట్లు పాల్గొననున్నట్లు వెల్లడి

నిజాంపేట్: తొలిసారిగా మేడ్చల్ జిల్లాలోని బాచుపల్లి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు వేదిక కానుంది. జూనియర్ నేషనల్ కబడ్డీ 2023-24 చాంపియన్‌షిప్ పోటీలు ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు జరుగనున్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కబడ్డీ అసోషియేషన్, తెలంగాణ కబడ్డీ అసోషియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో కాసాని కౌసల్య, కాసాని కృష్ణ ముదిరాజ్‌ల జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. అందుకోసం బాచుపల్లిలోని కబడ్డీ అకాడమీలో క్రీడాకారులు నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్నారు. తెలంగాణ కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏకేఎఫ్ఐ) ఉపాధ్యక్షుడు కాసాని వీరేశ్‌లు పోటీలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు

వివిధ రాష్ట్రాల నుంచి కబడ్డీ క్రీడాకారులు హాజరు కానున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 30 బాలికలు, 30 బాలురు మొత్తం 60 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. తెలంగాణ కబడ్డీ క్రీడాకారులు కొద్ది రోజులుగా ఈ పోటీల్లో విజయం సాధించేందుకు బాచుపల్లిలోని అకాడమీలో శిక్షణ పొందుతూ మెలకువలు నేర్చుకుంటున్నారు.

మంచి ప్రదర్శన కనబరిస్తే అంతర్జాతీయ జట్టుకు...

ఈ పోటీల్లో మంచి నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను అంతర్జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపిక చేయనున్నారు.49 జూనియర్ నేషనల్ కబడ్డీ 2023-24 చాంపియన్‌షిప్ పోటీలకు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రముఖులు హాజరుకానున్నట్లు సమాచారం. బాచుపల్లిలో ఈ పోటీలు జరుగనుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


బాచుపల్లిలో ప్రాక్టీస్ చేస్తున్న తెలంగాణ కబడ్డీ బాలికల జట్టు

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే..



కబడ్డీపై ఆసక్తి ఉన్న గ్రామీణ, పట్టణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నాం. పోటీలకు కావాల్సిన గ్రౌండ్ ప్రిపరేషన్ తదితర ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. కబడ్డీ పోటీలను చూసేందుకు వచ్చే వారికి సైతం ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులు, యువకులు ఈ పోటీలను తిలకించేందుకు రావచ్చు.

– జిల్లా కబడ్డీ అసోషియేషన్ సెక్రటరీ, ఏకేఎఫ్ఐ ఉపాధ్యక్షుడు కాసాని వీరేశ్

నేడు జేఎన్‌టీయూలో ఆడిటోరియంలో జాతీయ ఓటర్ల దినోత్సవం

హాజరు కానున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ఈనెల 25వ తేదీన ఉదయం 9గంటలకు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్, డిప్యూటీ సీఈఓ లోకేష్ కుమార్, స్టేట్ ఎన్నికల కమిషనర్ పార్థసారథి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అతిథులుగా పాల్గొననున్నారు. బుధవారం ఈ ఏర్పాట్లను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం పేర్కొన్న విధంగా సీటింగ్ అరేంజ్‌మెంట్స్ ఉండాలని సూచించారు. ఆడిటోరియం మొదటి గేటు నుంచి వీవీఐపీలు, రెండో గేట్ నుంచి అధికారులకు ప్రవేశం ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: చెట్ల కొమ్మలను తొలగింపు పనుల్లో భాగంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్ఎంటీహిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ పోలీస్‌స్టేషన్ ఫీడర్ పరిధిలోని సమతానగర్, జలవాయు విహార్, విజేత సూపర్ మార్కెట్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. అడ్డగుట్ట ఫీడర్ పరిధిలోని భాగ్యనగర్‌కాలనీ ఫేజ్ 3, ఎంఎస్ఆర్ స్కూల్ వెనుక వైపు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. అదే విధంగా అడ్డగుట్ట రోడ్డు నం. 1 నుంచి 3 వరకు ఉన్న ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు తెలిపారు.

మాధవరం, ఆల్విన్‌కాలనీ ఫీడర్ల పరిధిలో..

కూకట్‌పల్లి: చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో మాధవరం ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. సోమశిల సబ్‌స్టేషన్ పరిధిలోని మాధవర నగర్, వెంకటేశ్వర నగర్, కమల ప్రసన్న నగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1 ప్రాంతాల్లో ఉదయం 10.30 నంచి 12.30 గంటల వరకు. అదే విధంగా ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, సాయికళ్యాణ మండపం ప్రాంతం, రాఘవేంద్ర కాలనీ, ఈస్ట్, వెస్ట్ సాయి నగర్, ఆదిత్యా నగర్ కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు తెలిపారు.

ముష్కిపేట ఫీడర్ పరిధిలో...

మూసాపేట: ముష్కిపేట ఫీడర్ పరిధిలోని మూసాపేట, మారుతినగర్, జేపీనగర్, ఎస్‌పీనగర్, మూసాపేటలోని మరికొన్ని ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శంకర్ తెలిపారు. అదే విధంగా కైత్లాపూర్ ఓల్డ్ విల్లాస్, రాఘవేంద్ర కాలనీ, కైత్లాపూర్ పార్కు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పర్వత్‌నగర్‌లో కాషాయ జెండాల దహనం

- పర్వత్‌నగర్ చౌరస్తాలో ఘటన
- నిరసన తెలిపిన రాజకీయ పార్టీల నాయకులు
- దుండగులను శిక్షించాలని డిమాండ్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ చౌరస్తా డివైడర్ మధ్యలో ఉన్న కాషాయ జెండాను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. విషయం తెలుసుకున్న పలు రాజకీయ పార్టీల నాయకులు వచ్చి బాధ్యులైన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అల్లాపూర్ సీఐ శ్రీపతి ఆంజనేయులు పర్యవేక్షణలో మాదాపూర్‌తో పాటు వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘటనా స్థలాన్ని బాలానగర్ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, మాదాపూర్, కూకట్‌పల్లి ఏసీపీలు శ్రీనివాస్, శివభాస్కర్‌లు సందర్శించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అల్లాపూర్ సీఐ శ్రీపతి ఆంజనేయులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పన్నాల హరీష్‌రెడ్డికి శుభాకాంక్షలు



ఆల్విన్‌కాలనీ: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా రెండోసారి పన్నాల హరీష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్ బుధవారం హరీష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హరీష్‌రెడ్డి నేతృత్వంలో పనిచేయటం చాలా సంతోషమన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లాలో బీజేపీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. క్రమశిక్షణ కలిగిన నాయకుడు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటూ నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం సాగిస్తూ ముందుకు సాగే నాయకుడు హరీష్‌రెడ్డి కొనియాడారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు దుర్గా శ్రీకృష్ణ



భరత్‌నగర్‌కాలనీకి చెందిన వి.దుర్గా శ్రీకృష్ణ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికయ్యింది. ఇటీవల జరిగిన ఆర్‌డీసీ (రిపబ్లిక్ డే సెలబ్రేషన్స్) సెలక్షన్స్‌లో 8 విభాగాల్లో పోటీ పడి ఆమె అర్హత సాధించింది. చిన్నప్పటి నుంచి కూచిపూడిలో ప్రావీణ్యం ఉండటంతో నాట్య ప్రదర్శన కూడా ఇవ్వనున్నట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న దుర్గాశ్రీకృష్ణ రెండేళ్లుగా ఎన్‌సీసీలో శిక్షణ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె ఢిల్లీకి వెళ్లి రిహార్సల్ చేస్తున్నారని తెలిపారు. – మూసాపేట

వృద్ధురాలి అదృశ్యం


మల్లమ్మ (ఫైల్)

మూసాపేట: ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తూర్ గ్రామం, మహబూబాబాద్ జిల్లాకు చెందిన ముత్యం యాకయ్య మల్లంపేటలో నివాసం ఉంటూ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతని తల్లి మల్లమ్మ (60) భాగ్యనగర్‌కాలనీలోని మెట్రో స్టేషన్‌వద్ద కూర్చోబెట్టి ఇంటికి వెళ్లి వచ్చే సరికి కనబడలేదు. చుట్టు పక్కల ప్రాంతాల్లో, తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఆచూకీ తెలియక పోవటంతో ఆందోళనకు గురైన యాకయ్య కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి


అధికారులతో సమావేశమైన వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ రోజాదేవి రంగారావు

ఆల్విన్‌కాలనీ: హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రియాంక, జీహెచ్ఎంసీ ఏఈ ఆశతో కలిసి బుధవారం వివేకానందనగర్ డివిజన్‌లో కార్పొరేటర్ రోజాదేవి రంగారావు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మంజూరైన సీవరేజ్ లైన్లు, సీసీ, బీటీరోడ్డు పనులు కాంట్రాక్టర్స్‌తో మాట్లాడి త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీకార్పొరేటర్ మాధవరం రంగారావు, రామచంద్రరావు, హిమగిరిరావు, రవికుమార్, వెంకటేశ్వరరావు, వర్కు ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, ఎస్ఎఫ్ఏ సుదర్శన్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో రూ.300కోట్ల బిల్లులు

- కాంట్రాక్ట్ అసోసియేషన్
- బిల్లులు వెంటనే చెల్లించాలని జెడ్‌సీకి వినతి


కూకట్‌పల్లి జెడ్‌సీకి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ అసోసియేషన్ సభ్యులు

భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి జోనల్ పరిధిలోని కాంట్రాక్ట్ అసోసియేషన్ సభ్యులు బుధవారం జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గత 10 నెలలుగా పెండింగ్‌లో ఉన్న పలు నిర్మాణ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. బిల్లులు చెల్లించకపోవటంతో కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలో సుమారు రూ.300కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

2023 ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు జరిగిని పనుల బిల్లులు చెల్లించలేదన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం చూపుతానని హామీనిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అసోసియేషన్ సభ్యులు ఐలయ్య, మురారి, రంగయ్య, లక్ష్మీకాంత్, చక్రవర్తి, రోషిరెడ్డి, రమేష్, చిన్నయ్య పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


ప్రణయ్(ఫైల్)

మూసాపేట: ఉద్యోగానికి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కూకట్‌పల్లి బాగ్అమీర్‌లోని ఆకుల నరేందర్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని కుమారుడు ప్రణయ్ (26) బోయిన్‌పల్లిలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 18న ఉదయం 9గంటలకు ఉద్యోగం నిమిత్తం ఆఫీసుకు వెళ్లి మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. అతని ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఆఫీస్‌కు వెళ్లి అడగగా రాలేదని చెప్పారు. దీంతో తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఎటువంటి సమాచారం లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన తండ్రి నరేందర్ కూకట్‌పల్లి పోలీస్‌లను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: స్నేహపురి కాలనీ గణేష్ మండపం వద్ద ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని కాలనీ అధ్యక్షుడు వినోద్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతవాసులు సద్వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా డ్రైవర్స్ డే


డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ ఆర్‌ఎం కవిత, డీఎం మహమ్మద్ ఇస్మాక్

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో బుధవారం డ్రైవర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ డ్రైవర్లను డిప్యూటీ ఆర్ఎం కవిత అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రయాణికులను గమ్యస్థానాలకు క్షేమంగా చేర్చే బాధ్యత డ్రైవర్లపై ఉంటుందన్నారు. అందుకే బాధ్యతగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎం మహమ్మద్ ఇస్మాక్, సీఐ శ్రీలత, ఎంఎఫ్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌గౌడ్‌కు శుభాకాంక్షలు

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ఆనంద్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కేలండర్ ఆవిష్కరణ

ఆల్విన్‌కాలనీ: గొందళి సమాజ్ సంఘం 2024 నూతన సంవత్సర కేలండర్‌ను గొందళి సమాజ సంఘం రాష్ట అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఏక్‌నాథ్ దున్గేతో బీసీ కమిషన్ చైర్మన్ వకులభరణం కృష్ణమోహన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ.. గొందళి సమాజ్ సంఘం సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ కమిమీషన్ రాష్ట్ర సభ్యులు శుభప్రద్ పటేల్, గొందళి సమాజ్ సంఘం సభ్యులు పి. సంజయ్, జి. దత్తురావు, కె. రాజు, జి. అనిల్, జి. అంబదాస్, ఎన్. దత్తాత్రేయ, టి. గురు తదితరులు పాల్గొన్నారు.


గొందళి సమాజ్ సంఘం కేలండర్‌ను ఆవిష్కరించిన ఏక్‌నాథ్ దున్గే, వకులభరణం కృష్ణ మోహన్

పట్టుబడ్డ వాహనాల బహిరంగ వేలం

వాహన యజమానులు అభ్యంతరం ఉంటే పత్రాలు చూపించి తీసుకోవాలి

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పట్టుబడిన వివిధ రకాల వాహనాలను బహిరంగ వేలం వేయనున్నారు. సైబరాబాద్ (మెట్రో పాలిటన్ ఏరియా) పోలీస్ యాక్ట్-2004 ఆర్/డబ్ల్యూ సెక్షన్ యూ/ఎస్ 6(2),7 ప్రకారం బహిరంగ వేలం వేయాలని నిర్ణయించారు. ఈ వాహనాలకు సంబంధించి యజమానులు ఆసక్తి, అభ్యంతరం ఉంటే నోటిఫికేషన్ తేదీ నుంచి ఆరునెలల వ్యవధిలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో దరఖాస్తు చేసి తమ వాహనాలను క్లెయిమ్ చేసుకోవచ్చు. లేని పక్షంలో వదిలివేయబడి/ క్లెయిమ్ చేయని వాహనాలను వేలం నిర్వహిస్తారు. వాహనాల వివరాలు మొయినాబాద్ పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో ఉన్నాయి. వీటి కోసం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్ వీరలింగం ఫోన్ నెంబర్ 9490617317లో సంప్రదించాలి. మరిన్ని వివరాలకు సైబరాబాద్ పోలీస్ అధికారిక వెబ్‌సైట్ www.cyberabadpolice.gov.in లో చూడొచ్చు.

ఆకర్షణ.. పుస్తకాన్వేషణ


లైబ్రరీలో ఆకర్షణ


రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో..

- 6,500 పుస్తకాల సేకరణ, తొమ్మిది లైబ్రరీల ఏర్పాటు
- ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు ఆహ్వానం

సనత్‌నగర్: 'చినిగిన చొక్కయినా వేసుకో.. కానీ.. ఓ మంచి పుస్తకం కొనుక్కో' అనే నానుడి వింటే అర్థమవుతోంది పుస్తకానికి ఉన్న విలువ ఎలాంటిదో అని ఔను..ఆమె పిన్న వయసులోనే పుస్తకం గొప్పతనాన్ని గుర్తించి ఎందరికో చదువుకునే భాగ్యాన్ని కలిగిస్తోంది. ఏకంగా 6500 పుస్తకాలను సేకరించి తొమ్మిది లైబ్రరీలను ఏర్పాటు చేసి పుస్తక పఠనంపై ఆసక్తిని రేపుతోన్న ఆ చిన్నారిని గణతంత్ర వేడుకలకు ఏకంగా రక్షణ శాఖనే ఆహ్వానం పలికింది. అరుదైన ఈ గౌరవాన్ని దక్కించుకున్న చిన్నారి 'ఆకర్షణ' గతంలో ప్రధానమంత్రి మన్‌కీ బాత్‌లో మాట్లాడి యావత్ భారతావని మనసు గెలుచుకుంది. అలాగే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముచే ప్రశంసలు అందుకుంది.

లైబ్రరీలతోనే మనసుకు సాంత్వన కలిగిస్తూ..

సనత్‌నగర్ లోధా అపార్ట్‌మెంట్‌కు చెందిన సతీష్, ప్రవిత దంపతుల కుమార్తె ఆకర్షణ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. తండ్రి సతీష్ హెల్త్‌కేర్ కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తుండగా, తల్లి ప్రవిత గృహిణి. 12 సంవత్సరాల వయసున్న ఆకర్షణ 2021 నుంచి ఇరుగుపొరుగు వారు, అపార్ట్‌మెంట్లు, తోటి విద్యార్థులు, బంధువుల నుంచి పుస్తకాలను సేకరించి తొమ్మిది లైబ్రరీలను ఏర్పాటు చేసింది. 2021లో ఎంఎన్‌జే కేన్సర్ చిల్డ్రన్ ఆస్పత్రిలోని రోగులకు, వారి సహాయకులకు ఆహారాన్ని అందించేందుకు తల్లిదండ్రులతో కలిసి వెళ్లిన ఆకర్షణ అక్కడి వారి అవసరాలను తెలుసుకుని పుస్తకాలను సేకరించి లైబ్రరీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మొట్టమొదటిసారిగా తనను ఈ పనికి ప్రేరేపించిన ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్‌లోనే లైబ్రరీని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్, బోరబండ అల్లాపూర్ గాయత్రీనగర్ అసోసియేషన్, బాలికల కోసం జువైనల్, అబ్జర్వేషన్ హోమ్, కోయంబత్తూర్ సిటీ పోలీస్–స్ట్రీట్ లైబ్రరీ, చెన్నై బాయ్స్ క్లబ్–నోలంబూర్ పోలీస్‌స్టేషన్, సనత్‌నగర్ ఓల్డ్ ప్రభుత్వ పాఠశాల, సిద్దిపేట ఉమెన్ సేఫ్టీవింగ్ భరోసా సెంటర్, తమిళనాడు కన్యాకుమారి జిల్లాలోని కులితురై గ్రామంలో లైబ్రరీని ఏర్పాటుచేసి చిన్నారులు, పౌరుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందింపజేస్తోంది. అంతే కాకుండా తెలంగాణ ఆధారిత మానేరు రచయితల సంఘం, బాల సాహిత్య పరిషత్, దక్కన్ సాహిత్య సభలు ఆమె లైబ్రరీల ఏర్పాటుకు వెయ్యి పుస్తకాలు విరాళంగా అందజేసేందుకు ముందుకు వచ్చాయి. అలాగే భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ కూడా లైబ్రరీ కార్యక్రమాల నిమిత్తం వెయ్యి పిల్లల పుస్తకాలను విరాళంగా ఇవ్వడానికి ముందుకు వచ్చింది.

ప్రముఖుల మన్ననలు..

ఆకర్షణ చేస్తున్న ఈ పుస్తక యజ్ఞం గురించి దేశ నలుమూలలా పాకింది. 2023, సెప్టెంబర్ 24న ప్రధానమంత్రి మన్‌కీ బాత్ 105వ ఎపిసోడ్‌లో స్వయంగా ప్రధానమంత్రి ఆకర్షణతో మాట్లాడి ఆమె చేస్తున్న లైబ్రరీ సేవలకు అభినందనలు తెలిపారు. అలాగే 2023 డిసెంబర్‌లో హైదరాబాద్ పర్యటన సమయంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసే అవకాశం కూడా లభించడమే కాదు ఆమె చేస్తున్న లైబ్రరీల ఏర్పాటు ప్రయత్నాలను ప్రశంసించారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పోలీసు ఉన్నతాధికారుల ప్రశంసలను ఆకర్షణ అందుకుంది. ఆకర్షణగా ఇప్పుడు మరో అరుదైన అవకాశాన్ని పొందింది. శుక్రవారం ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొనేందుకు రక్షణ శాఖ ఆమెకు ఆహ్వానాన్ని పంపడమే కాకుండా విమాన టికెట్లు, హోటల్ బస ఏర్పాట్లను కూడా చేసింది. పుస్తక పంపిణీ, పఠన ప్రోత్సాహం పట్ల ఆమె నిబద్ధత ఎందరికో స్ఫూర్తినిస్తుందని చెప్పడంలో సందేహం లేదు. బుధవారం సాయంత్రం తల్లిదండ్రులతో కలిసి ఆమె ఢిల్లీ బయలుదేరారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

హఫీజ్‌పేట్ : పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామని ఆదాయపు పన్ను ప్రిన్సిపల్ కమిషనర్ డాక్టర్ డి.సుధాకరరావు అన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛత పక్వాడ శ్రమదాన కార్యక్రమంను భారత ప్రభుత్వం ఆదాయపు పన్ను విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ డి.సుధాకరరావు, కమిషనర్ ఏజీవి ప్రసాద్, అడిషనల్ కమిషనర్లు ఎస్‌పిజి మొదలియార్, రీమా యాదవ్, హర్షిత్ చౌహాన్, అధికారి సీహెచ్.వి. పైడేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ పురుషోత్తంరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలో పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల ఆవరణను శుభ్రం చేసి, మొక్కలు నాటారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆదాయపు పన్ను విభాగం అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ కమిషనర్ సుధాకరరావు

సంగీతోత్సవాలు.. వీణా కచేరీ

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న 9వ హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవాలను బుధవారం పద్మశ్రీ అవార్డు గ్రహీత అన్నవరపు రామస్వామి, సంకీర్తన చూడామణి జే.ఎస్ ఈశ్వర ప్రసాద్ భాగవతార్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటి జనరల్ మేనేజర్ సారథి ప్రారరంభించారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలలో సాయంత్రం కచేరీలు, ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. చివరిరోజు ఉంచవృత్తి, నగర సంకీర్తనం, ఉత్సవమూర్తి ఊరేగింపు, జంటనగరాల సంగీత విద్వాంసులతో పంచరత్న గోష్టి గానం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్వాన్ దుద్దు సీతారామయ్య వీణా వాదన కచేరితో సందర్శకులను ఆకట్టుకున్నారు. వయొలిన్ విద్వాన్ వాసుశాస్త్రీ, మృదంగం విద్వాన్ రామకృష్ణ, ఘటంపై విద్వాన్ ఫణిభూషన్ వాద్య సహకారాన్ని అందించారు.

అపర్ణ కౌంటీలో ఎమ్మెల్యే పర్యటన

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని అపర్ణ కౌంటీలో నెలకొన్న సమస్యలపై బుధవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపర్ణ కౌంటీలో ఔట్‌లెట్ సమస్యపై కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు పర్యటించామన్నారు. ఔట్‌లెట్ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. మురుగు నీరు ఔట్‌లెట్ ద్వారా కాయిదమ్మకుంట చెరువులోకి చేరుతుండడంతో చెరువు మురుగుమయంగా మారిందన్నారు. చెరువులో కలవకుండా యూజీడీ పైప్‌లైన్‌లోకి మళ్ళించాలని చెరువు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. త్వరలో కాయిదమ్మకుంట చెరువును సుందరీకరిస్తామని అన్నారు.